# వంటొచ్చిన మొగుడు! - రాని పెళ్ళాం!

చుట్టం చూపుగా ఇంటికొచ్చిన మామయ్య ఏదో ఒకరోజు తిండి లాగించి వెళ్ళిపోతే బాగుండేది. సిటీ చూడాలంటాడు. చార్మినార్ ఎక్కాలంటాడు. 'జూ'కి వెళదాం రమ్మంటాడు. బుద్ధుని విగ్రహం చుట్టూ హుస్సేన్‌సాగర్లో బోటు షికారు చెయ్యాలంటాడు. చికెన్ ఫ్రైలాగా నన్ను కాసేపు తినడం మొదలుపెట్టాడు.

మామయ్య సోది వింటూ నేన్నోర్మూసుకున్నా... నా భార్య భ్రమరాంబ ముఖం కాల్తున్న పెనం మీద నీటిబొట్టు పడ్డట్టు అయింది. చిటపటలాడింది. మూలిగింది. నీలిగింది. చివరకి ఏమీ చేయలేక పాశుపతాస్త్రం సంధించినట్టు అలిగింది. అంతకంటే ఏం చేయగలదు పాపం?

నేను మాత్రం ఏం చేయగలను? ఆ వచ్చింది స్వయాన మా అమ్మకి అన్నగారే కాబట్టి... అంటే నాకు బంధువు కాబట్టి నాలుగురోజులు ఆఫీసుకి శెలవుపెట్టి పారేశాను. అటు మామయ్యను తిప్పి సిటీ అంత చూపించే పని... ఇటు ఇంట్లో వంట పనీ రెండూ నా నెత్తికెత్తుకోక తప్పలేదు.

అదేమిట్రా అబ్బీ... వంట సుప్ చేస్తున్నావేమిటి? అంటూ క్వశ్చన్ చేయనే చేసాడు.

ఏం చెప్పాలో పాలుపోక... అబద్ధం చెప్పేయ్‌మని ఆత్మఘోషిస్తుంటే 'అది దూరంగా వుంది' ఠక్కున అనేశాడు.

ఛ! నోర్ముయ్! అబద్ధాలాడడం ఎప్పుడు నేర్చుకున్నావ్?... మీద ఎక్కేశాడు మామయ్య.

నేను చెప్పింది అబద్ధమేనని మామయ్య ఎలా ఊహించాడో బోధపడ్లేదు.

"అబద్ధం చెప్పినా 'క్విక్ ఫిక్స్' మల్లే అతికినట్టుండాలి... నీకు ఏది చేతనై ఏడవదు..." అంటూ శాపనార్థాలు పెట్టాడు.

మామయ్యకి చాదస్తం పాలెక్కు. అనవసరమైన ప్రశ్నలతో నా డొక్క చించి డోలు కట్టేయడం బొత్తిగా నచ్చి చావడంలేదు. దానికి తోడు ఆయనగారి మాటలు వింటూ భ్రమరాంబ పకపక నవ్వొకటి!

"మడి ఆచారం గల వంశం మీది. మీ తాతగారు అగ్నిహోత్రావధాన్లుగారంటే నిప్పు! నీ తండ్రి సరేసరి. సదాచార సంపన్నుడు. మీ అమ్మ మడి కట్టుకుని వంటచేస్తే గాని ముద్ద ముట్టడు. అలాంటిది... నీ భార్య బైట చేరిందని చెవిలో క్యాబేజీ పువ్వు పెడతావా?" రెచ్చిపోయాడు.

మామయ్య మాటలు నా చెంపమీద ఫెడీల్మని కొట్టినట్టు అనిపించినయ్.

"మామయ్యా!... ఇంతకూ నీ డౌటేంటి?" బుర్ర గోక్కుంటూ అడిగాను.

"చూడు చంద్రశేఖర శాస్త్రీ..."

"నన్నలా దీర్ఘాలతో పిలవద్దు..."

"పేర్లని కత్తిరించడాలు... ముద్దు పేర్లతో పిలవడాలు నాకు బొత్తిగా నచ్చదు సుమీ! ఆ! ఏం చెప్తున్నానూ... నీ పెళ్ళాం దూరంగా వున్నట్టయితే చెంబు పుచ్చుకుని... చాపమీద ముందు గదిలో కూర్చునేది అవునా?!"

"అవును కదా!... రూలంతే కదా?"

"అన్నీ తెలిసి కోతలెందుకు కోసావ్?"

"అంటే?" వెర్రిమొహం వేశాను.

"నీ సహధర్మచారిణి... నీ భార్య... అదే నేయ్ నీ శ్రీమతి! ఎవరు? చి.ల.సౌ.భ్రమరాంబ... నీ బెడ్‌రూమ్‌లో పరుపుమీద పడుకుని గుర్రు పెట్టడం నా కళ్ళారా చూసాను"

"ఎప్పుడు?"

"క్షణం క్రితం"

చచ్చాన్రా దేవుడోయ్... ఈ మామ-మహాశయుడు మహాతెలివైనవాడు. అన్నీ పూసగుచ్చి నట్లు చెప్పి ప్రాణాలు తోడేస్తున్నాడు. నోరు మెదపలేకపోయాను.

"అంటూ సొంటూ లేకుండా సిటీ కాపురాలు ఇలా అఘోరిస్తున్నాయన్నమాట! అవ్వ అవ్వ (సారా హవ్వ!)... ఎంతకు తెగించారు?..." లబలబ మొత్తుకున్నాడు.

అయోమయంలోంచి కాస్తంత తెప్పరిల్లుకుని "అది కాదు మామయ్యా... అదీ... అది... అదేమో పాపం చాపమీద పడుకోలేదు. ఎంచేతంటే... ఛాతి నొప్పిట. సారీ! అదే... నడుము నొప్పంది. జాలేసి మంచం మీద పడుకోమన్నాను..." మరో అబద్ధం ఆడేసాను.

"అఘోరించలేకపోయావ్..."

"సిటీలో అంతా ఇంతే మామయ్యా! మడిగిడి అంటూ కూర్చుంటే పన్లవవ్. ఎవరూ పట్టించుకోరు కూడా!"

"చేసిన వెధవ పనికి... సమర్థింపొకటి? ఈ విషయం మీ అమ్మానాన్నలకి తెలిస్తే... ఉరేసుకు ఛస్తారు!... నేనంటే ఏదో అవసరానికి సర్దుకుపోగలను..."

ఆ చివరి మాట వినగానే ఎగిరి గంతేసినట్లయింది నా పరిస్థితి. డీప్ బ్రీత్ తీసుకుని మెల్లగా వదిలాను.

"అవునూ... మరి.. ఈ పూట శాకపాకాలేమిటి?"

"బంగాళాదుంపల వేపుడు... కందిపచ్చడి! కొత్త ఆవకాయ వుండనే వుంది జాడిలో! కావాలంటే చెప్పు అప్పడాలు కాల్చి వడియాలు వేయిస్తాను..."

"అది సరేరా. ఆనపకాయ ముక్కవుంటే కాస్తంత పులుసు కూడా పెట్టు. పులుసు లేకపోతే తిన్నట్టన్పించి ఛావదు. అది సరే... కందిపచ్చడి రోట్లోనే రుబ్బాలి సుమా! మిక్సీలో ఆడిస్తే 'పేస్ట్' అవుతుంది. రుచే వుండదు..." చాదస్తంతో పాటు రుచి పాకాల పాఠం చదివేడు.

మూర్ఛ వచ్చినంత పనైంది నాకు!

అంతలోనే తెప్పరిల్లుకుని "మైడియర్ మామయ్యా! ఇవన్నీ వండి వారుస్తూ కూర్చుంటే... బయటికి తీసుకెళ్ళి నిన్ను తిప్పుకు రావడానికి టైం సరిపోదు మరి..." మనసులో మాట చెప్పాను.

"చూడు! ముందు భోజనం! తర్వాతే మిగతావి... అర్థమైంది కదా... సిటీ అంటే ఎంత గొప్పగా వుంటుందో అనుకున్నాను. తీరా చూస్తే ఏముంది? అంతా మురికి కూపంలా వుంది! ఎక్కడ చూసినా చెత్తడబ్బాలు... మురికి గుంటలు... గుంటల రోడ్లు... వాహనాల జోరు... అంతా పొల్యూషన్! కంపు మీరిక్కడెట్లా బ్రతుకుతున్నారో గాని... నాకు రోతన్పిస్తోంది..."

"అయితే ఏమంటావ్?"

"చూచినంత వరకూ చాలుగానీ... రాత్రికి నన్ను రైలెక్కించు. వంట మాత్రం నువ్వు రుచిగా చేసేడు"

హమ్మయ్య! సిటీ దెబ్బకు మామయ్య ఝడుసుకున్నాడు. తోకపీకేస్తానంటున్నాడు. లేకపోతే ఇంత త్వరగా కదిలే ఘటం కాదు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక రైల్వే స్టేషన్‌కి బయల్దేరాను.

"ఒరేయ్...! డబ్బు అనవసరంగా తగలేసేవ్. నేను సీనియర్ సిటిజన్‌ని! కన్సెషన్ వుంటుంది. ఆ విషయం గుర్తుంచుకుని టిక్కెట్టు కొను..." ముందుగానే వార్నింగ్ ఇచ్చాడు.

తెలుసులెమ్మన్నట్లు తలూపి బైటకి కదిలాను.

★★★★★

పెళ్ళి చూపులనాడే నీకు వంటా వార్పూ వచ్చని మావాళ్ళు నిన్ను నిగ్గదీసి మరీ అడిగితే... నువ్వేమో గంగిరెద్దులా తలూపేవు. మీ పేరెంట్స్ నీకు వత్తాసొచ్చారు.

తీరా చూస్తే... నీకు బియ్యం కడిగి పొయ్యిమీదకెక్కించడం చేతనై ఏడవలేదు.

ఏదో... ఎర్రగా బుర్రగా వున్నావు కదా... కాస్తంత కూడొండిపెట్టలేకపోతావా అని

భ్రమపడ్డాను. చూడిప్పుడు నా అవస్థ. చుట్టం ఇంటికొస్తే నువ్వు వంటరాదని చెప్పలేక మంచమెక్కుతావ్.

ఆ వచ్చినవారికి వండిపెట్టలేక నా చావుకొస్తోంది.

నిజం అనాడే చెప్పేడ్చినట్టయితే నీ మెళ్లో తాళికట్టి వుండేవాడినే కాదు. నేనిట్లా గొంతుచించుకు మాట్లాడి అఘోరిస్తుంటే బెల్లం కొట్టిన రాయిలా ఏమిటా మౌనం?

"ఏమిటండీ మహా ఇదైపోతున్నారు? తెగ రెచ్చిపోతున్నారు. అవును! నాకు వంటరాదు! అయితే ఏమంటారు? విడాకులిచ్చేస్తారా? తలతీసి మొలేస్తారా?" ఎదురు మాట్లాడింది భ్రమరాంబ.

ఎక్కడ్నుంచి వచ్చింది దీనికింత ధైర్యం అనుకుని ఆశ్చర్యపోయాను.

'పోనీ... వంటరాకపోతే... నేను నేర్పుతానన్నాగా?! నన్ను చూచి నేర్చుకోనూలేదాయె? ఇలా నన్ను సతాయించడం భావ్యమా చెప్పు భార్యామణీ...' నేనే తగ్గి మాట్లాడాను.

"ఇన్నేళ్ళ మన కాపురంలో నీకు పప్పులోపోపు పెట్టడం... మజ్జిగ చిలకడం... పచ్చడి రుబ్బడం... చేతకాకపోయే? రేపు మా అమ్మానాన్న వచ్చారంటే... నేచచ్చానే! ఏదో మొగుడ్ని కాబట్టి నువ్వు ఎట్లా వండి పడేసినా... వుడికీ వుడకని మెతుకులు, రుచీపచీలేని పదార్థాలు తింటూ సరిపెట్టుకుంటున్నాను..." మళ్ళీ నేనే వాగేను.

"సర్లెండి! మీరు మరీను... ఏ ఆడదైనా ఇంతకంటే ఏం బాగా చేస్తుంది గనుక? ఎట్లా చేసినా వంకలు పెడ్తూనే వుంటారు. మీర అమ్మానాన్న ఒక్కసారైనా రాలేదు. మేము ఎంత సుఖపడుతున్నామో చూసిన పాపాన పోలేదు.

రేపు ఉదయం ట్రైన్‌కి అమ్మానాన్నలొస్తున్నారనే విషయం తెలిసిన క్షణంనుంచి నాలో ఆందోళన మొదలైంది. నాచేత కంగారు భరతనాట్యం చేయిస్తోంది. ఎర్లీగా ఆఫీసునుంచి ఇంటికొచ్చాను. స్నానం కార్యక్రమం ముగించి భ్రమరం ఇచ్చిన వేడివేడి కాఫీ చప్పరిస్తూ "ఇదిగో! మావాళ్ళు రేపొచ్చి దిగుతున్నారు. కూరలు ఏం కావాలో చెప్పు! సరుకుల లిస్టు రాసివ్వు. తెస్తాను. నువ్వు చేసే శాకపాకాలతో మావాళ్ళు గుమ్మైపోవాలి! అత్తమామలను మంచి చేసుకోవడానికి నీకిదే మంచి ఛాన్స్- వింటున్నావా?" స్వరం పెంచి మాట్లాడాను.

తలూపింది భ్రమరాంబ శ్రద్ధగా క్లాసులో పాఠం విన్న స్టూడెంట్‌లాగా.

"పెళ్ళిచూపులరోజున కూడా నువ్విలాగే నోరు విప్పకుండా తలూపావు. గుర్తుందా? తర్వాత కొంప ముంచావ్. చూడు... మనం సంసారం పెట్టేక మావాళ్ళు రావడం ఇదే ప్రథమం! మా వాళ్ళు తిండిపోతులు కాకపోయినా మంచి పాకాలు తెలిసిన వాళ్ళు కనుక కాస్తంత వళ్ళు దగ్గరుంచుకుని వంటచెయ్. వాళ్ళని మెప్పించే ప్రయత్నం చెయ్... లేకపోతే మన కాపురం కొల్లేరవడం ఖాయం..." మరోసారి ఘాటుగా శ్రీమతిని హెచ్చరించి తేవలసిన

వాటి కోసం వీధిన పడ్డాను.

★★★★★

సిటీ ముఖం ఎన్నడూ చూచిన వాళ్ళు కాకపోవడాన నేను పేరెంట్స్‌ని రిసీవ్ చేసుకునేందుకు సికింద్రాబాద్ బయల్దేరాను.

అప్పటికే ట్రైనొచ్చి ఆగడం చూచి నడకవేగం పెంచి స్టేషన్లో ఎగ్జిట్ గేట్ దగ్గరకొచ్చి నిలబడ్డాను.

"హమ్మయ్యా! వచ్చేడిశావ్ కదా... రాకపోతే మా గతేమిటాని మధనపడి ఛస్తున్నాను..."

డాడీ శాపనార్థాలతో ఫస్ట్ విజిట్ మొదలైంది. నాన్న చేతిలో 'బేగ్' అందుకుని ముగ్గురం బైటకొచ్చి ఆటో ఎక్కేం!

"ఎట్టా వుందిరా ఇక్కడ నీ పరిస్థితి?" తోవలో నాన్న అడిగేడు.

అన్నీ సైగలే కానీ నాన్నతో మాట్లాడాలంటే ఇంకా భయం పోలేదు. అంచేతనే నవ్వాను!

అమ్మ నా తల నిమురుతూ "బాగా చిక్కినట్టున్నావ్..." అంది.

ఆటో ఇంటిముందు ఆగింది. ముందునేను... నా వెనగ్గా అమ్మానాన్న... ఆటో దిగి ఇంటి ప్రహరీ గేటు తీసుకని లోపలికి ఎంటరైనామ్.

"అమ్మడు... అదే నా అర్థాంగి పైట నిండుగా కప్పుకుని బయట అరుగుమీద నీళ్ళ చెంబుతో అవుపించింది.

"కులాసాయేనా మామయ్యగారూ..." అంటూ నీళ్ళ చెంబు అందించి కాళ్ళు కడుక్కోమంది.

"ప్రయాణం బాగా సాగిందా అత్తయ్యా" అత్తగారిని పరామర్శించడంతో వాళ్ళ ముఖాలు చాటంతైనాయ్.

మొత్తానికి భ్రమరాంబకి పట్లు తెల్సు సుమా అనుకున్నాను మనసులోనే. వంటా వార్పు విషయాల్లో కూడా ఇదే లెవెల్ మెయింటెయిన్ చేస్తే... ఇంకేముంది? అంతా భేష్...

అందరం ఇంట్లోకి నడిచాం.

లంకలకోడేరులో లంకంత కొంప... పదెకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలం... వయసు మీదపడ్డా తండ్రి పౌరోహిత్యం... రెండు చేతులా ఆర్జన!

వైభవోపేతంగా ముగ్గురు కూతుళ్ళ పెళ్ళిళ్ల చేసి ముగ్గురు అల్లుళ్లనూ తనచేతి కిందే పెట్టుకుని పౌరోహిత్యంలో ధర్మసూక్ష్మాలు నేర్పిన ఘనాపాటి మా నాన్న!

ఆయనంటే వూళ్ళో అందరికి గౌరవం!

ఈనాటికీ మావూళ్లో మా నాన్న ఎంత చెబితే అంత! ఆయన మాటంటే వేదవాక్కు!

ఒక్కగానొక్క మగపిల్లవాడిని... వాళ్ళ కలలపంట నేను అవడం మూలాన గారాబంగా పెరిగాను.

ఇప్పటికీ మా నాన్నంటే నాకు హడలే! మాటకి ఎదురుచెప్పలేను.

కులవృత్తిలోకి దింపుతానని నాన్నగారు అంటే... ఎందుకులెద్దురూ... ఒక్కగానొక్క నలుసుని చదివిస్తే పోలా... అని అమ్మ అనడం... నాన్న ఒప్పుకోవడం వల్లనే నేను డిగ్రీ చేసి సిటీలో వుద్యోగం చేయడానికి అవకాశం దొరికింది.

"ఆఁ! ఏంటోయ్ చంద్రం విశేషాలు? "స్నానం చేసి సంధ్యావార్చడం ముగించి హాల్లోకొచ్చి తాపీగా ఈజీ ఛైర్లో నడుమువాల్చి ప్రశ్నించారు గౌరీపతి శాస్త్రి.

"మీరొస్తున్నారని తెలిసి నాలుగురోజులు ఆఫీసుకి శెలవు పెట్టాను..." అని నసిగానన్న మాటేగాని అసలు నేనింట్లో వున్న కారణం వేరు. నేను ఎదురుగా లేకపోతే భ్రమరాంబ ఎక్కడ వంట తగలేస్తుందేమోననే భయం.

"అదిసరే... నీ కొత్త కాపురం ఎట్లా వుంది? కోడలు కమ్మగా వండి పెడుతోందా? నువ్వేమో పుల్లలా అగుపిస్తున్నావ్..."

తండ్రి కూపీ లాగడం మొదలైనందుకు కంగుతిన్నాను.

నీళ్ళు నములుత్తూ బుర్రాడించాను.

"తండ్రివయ్యే యోగ్యత నీ ముఖాన వున్నట్లు అవుపించడంలేదే..." ఎగాదిగా కొడుకుని చూస్తూ అన్నాడు గౌరీపతిశాస్త్రి.

"మీకు అంతా బులపాటమే! సిటీలో సంసారమంటే మాటలా? అప్పుడే పిల్లలు పుట్టుకొస్తే వీళ్ళు సుఖపడేదెన్నడు?" పక్కనే వున్న తల్లి అనసూయమ్మ కవర్ చేసింది.

"నువ్వేమిటే ఇక్కడున్నావ్? వెళ్ళి మడి కట్టుకుని వంట సంగతి చూడూ... కొత్త గదా... కోడలు కంగారుపడుతుందేమో?"

భర్త మాటకి అడ్డొచ్చి "కోడలు పిల్లనే వంటచేయనీయండి! ఇంతవరకూ మనం వంట రుచి చూడలేదుకదా? వంట బ్రహ్మాండంగా చేస్తుందని పెళ్ళిచూపులప్పుడు వియ్యాలారు తెగ గొప్పలు చెప్పుకున్నారు గుర్తుందా" సమయస్ఫూర్తితో మాట్లాడింది అనసూయమ్మ.

అమ్మ మాటలు విన్న నాకు గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టనిపించింది.

ఇంతలో 'కెవ్' మనేకేక... 'ధబ్'మనే శబ్దం విని ముగ్గురం ఆదుర్దాగా వంటింట్లోకి పరుగుతీశాం.

తీరా అక్కడికివెళ్ళి చూద్దుము కదా... ఇంకేముంది? భ్రమరాంబ నేలమీద పడి వుంది. కాళ్ళూ, చేతులూ ఆడిస్తూ మెలికలు తిరిగిపోవడం చూసి నిర్ఘాంతపోయాం.

"చూస్తావేంట్రా... కోడల్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళు... ఊఁ త్వరగా..." గౌరీపతిశాస్త్రి తొందరచేశాడు.

అనసూయమ్మకి గుండెల్లో రైళ్ళు పరిగెత్తినయ్. రాకరాక తొలిసారిగా కొడుకు ఇంటికి వస్తే ఇదేం అవాంతరంరా దేవుడోయ్.... అనేసి గుండె బాదుకుంది.

"ఈ పిల్లకేమైనా మూర్ఛలరోగం వుందేమో? నిజం దాచి మన పిల్లవాడికిచ్చి అంటగట్టి వుంటారు వియ్యాలవారు... ముఖం చిట్లించి గొణిగాడు గౌరీపతిశాస్త్రి.

"పెళ్ళాన్ని తీసుకెళ్ళి గంట దాటింది... ఇంకా చంద్రం రాలేదేంటి చెప్మా?... నాకేదో భయంగా వుంది. అసలు మనం రాహుకాలంలోనో, వర్జ్యంలోనో ప్రయాణమై వుంటాం..."

"ఛస్ నోర్మూయ్! పంచాంగం చూచి మరీ బయల్దేరాం!" భుజాన వున్న యజ్ఞోపవీతాన్ని రెండు చేతుల్తో ఆడిస్తూ కోపాన్ని ప్రదర్శించాడు.

"సరే... మనం ఆందోళన చెంది ఏం ప్రయోజనం? వెళ్ళిన వాళ్ళు వస్తే గానీ విషయం తెలీదు. మనకేమో సిటీ కొత్తాయే?" కంగారుగా మాట్లాడింది.

"సరే...సరే...నువ్వెళ్లి మడికట్టుకుని... వంట సంగతి చూడు... ఈలోపు వాడు వచ్చేస్తాడు..." అనడంతో అటుకేసి నడిచింది అనసూయమ్మ.

★★★★★

రెండురోజులు భ్రమరాంబని ఆస్పత్రిలో వుంచి అన్ని టెస్టులూ చేయించి నాలుగువేలు బిల్లు కట్టి ఇంటికి తీసుకొచ్చాను.

వచ్చీరాగానే ఆపసోపాలు పడుతూ... ముక్కుతూ... మూలుగుతూ... వెళ్ళిగదిలో బెడ్‌మీద వాలిపోయింది.

కొడుకు ఇంటికొచ్చి వంటపని... ఇంటి చాకిరీ అమ్మకు తప్పలేదు. నాకు బాధన్పించింది.

ఇహ మేమెందుకిక్కడ?... మమ్మల్ని ఈ రాత్రికే బస్సెక్కించరా... మీ తిప్పలేవో మీరు పడుదురుగాని... అన్నాడు గౌరీపతిశాస్త్రి.

నాలుగు రోజులు వుండిపోదామండీ... అంది అమ్మ.

కోడలికి సేవలు చేస్తూ ఇక్కడే వుంటావా? అంటూ నాన్న కసురుకోవడంతో అమ్మ నోరు మెదపలేకపోయింది.

సాయంత్రం ఏడు గంటల బస్సుకిద్దరినీ ఎక్కించి... బస్సు కదిలేవరకూ వుండి... ఇంటికి

తిరిగొచ్చాను.

"హమ్మయ్యా... వాళ్ళని పంపించేసారు కదా... ఇక నా చేతనైన వంటేదో నేనే చేస్తాను..." మంచం దిగుతూ అంది భ్రమరాంబ.

"అసలే లంఖణాలు చేసి నీరసంగా వుంటివి... రెండ్రోజులు నేనే వంట చేస్తాను... నువ్వు పడుకుని రెస్ట్ తీసుకో..." భ్రమరాన్ని వారించాను.

అవును మరి... తిండి తిని ఎన్నాళ్ళయిందో... ఇవాల్టికి నాలుగోరోజు! రొట్టె పాలతో... బత్తాయి రసాలతో... కొబ్బరినీళ్ళతో నోరంతా పాడైంది. ఈ పూటయినా కమ్మగా కడుపునిండా ఆవకాయ కలుపుకుని తినకపోతే చచ్చేట్టున్నాను... అంది.

రోగంతో వుండి ఆవకాయ తింటావా? గద్దించాను.

మీరూ నమ్మారా? నాకే రోగమూలేదు. వాళ్ళకి నా వంట నచ్చదు కదా... వారికి అనువుగా వంటచేసి పెట్టడం నాకు చేతనై చావదు కదా? అందుకే మాంచి ప్లానేసాను. నా పాచిక పారింది. లేని రోగాన్ని నటించాను. వాళ్ళకి నాచేతివంట రుచి చూపించకుండానే తిరుగు టపా కట్టించాను... చూశారా భ్రమరాంబ తఢాకా అంటే ఏమిటో...

ఆ మాటలు విని అవాక్కయ్యాను.

ఓసి నిన్ను తగెలెయ్య... నీకెంత తెలివి ఇచ్చాడే ఆ దేముడు? ఆశ్చర్యం కోపం రెండూ వక్కసారిగా నాలో కలిగాయి.

మళ్ళీ అత్తమామలొచ్చేలోపు నేను వంట నేర్చుకోలేకపోతానా? మీరు చూడకపోతారా? అంది.

నువ్వు జిత్తులమారి దానివే మొత్తానికి! వంట చేయడం రాకపోయినా తెలివి మాత్రం బోలెడుంది. అంటూ శ్రీమతి నెత్తిన మృదువుగా మొట్టికాయ వేసి నవ్వాను.

- సమాప్తం -

*(నవ్య వీక్లీ 21-03-07)*